క్లుప్తంగా

రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలి

పుల్లలచెరువు: రేషన్‌కార్డులు లేని వారికి ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసుకునే అవకాశం కల్పించిందని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్డులు లేని వారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రేషన్‌కార్డు విభజన, కార్డులో అడ్రస్ మార్పు కోసం, కార్డులో సభ్యుల తొలగింపు, రేషన్‌కార్డు సరెండర్ చేయడం, కార్డులో ఆధార్ సీడింగ్ కోసం మార్పులు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

తాళ్లూరు: కొత్త రేషన్ కార్డుల కోసం సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీవో దారా హనుమంతరావు కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రేషన్ కార్డులో ఆధార్ సీడింగ్ కోసం, చిరునామా మార్పిడి, కొత్త సభ్యులు చేర్చుకోవడం, తొలగించడం, రేషన్ కార్డ్ విభజన కోసం, రేషన్ కార్డ్ సరెండర్ కోసం దరఖాస్తులను ప్రభుత్వం విడుదల చేసిందని, వాటిని మండల ప్రజలు ఉపయోగించుకుని లబ్ధి పొందాలన్నారు.

సీపీఐ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గురుమూర్తి

దొనకొండ: సీపీఐ 17వ జిల్లా మహాసభల కరపత్రాలను మండల కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. జూన్ 21, 22, 23వ తేదీల్లో నియోజకవర్గ కేంద్రం దర్శిలో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని, మండలంలోని అన్ని గ్రామాల సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని గురుమూర్తి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రుద్రసముద్రం శాఖ కార్యదర్శులు చెన్నుబోయిన కాశయ్య, బచ్చలకూరి మరియదాసు, సహాయ కార్యదర్శులు చెన్నుబోయిన ఆంజనేయులు, బచ్చలకూరి ఏసు, బచ్చలకూరి పెద్దకాశయ్య పాల్గొన్నారు.

మంచినీటి బోరుకు మరమ్మతులు



మరమ్మతులకు నోచుకోని మంచినీటి బోరు

పుల్లలచెరువు: మండలంలోని పీవీపల్లి బస్టాండ్ వద్ద ఉన్న మంచినీటి బోరును బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. పీవీపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై బస్టాండ్ నిర్మించారు. అక్కడ ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడకూడదని బోరు వేశారు. కానీ అది మరమ్మతులకు గురై చాలా కాలమైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. మండల గ్రాంటులో చేతి పంపుల మరమ్మతుల కోసం నిధులు డ్రా చేస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే చేతి పంపును బాగు చేయాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

దైవ మార్గంలో ఉండి చెడు అలవాట్లు వదిలేయాలి

కురిచేడు: పిల్లలు దైవ మార్గంలో నడుస్తూ చెడు అలవాట్లు వదిలేయాలని పొట్లపాడు తెలుగు బాప్టిస్టు చర్చి సంఘ కాపరి కొదమల ప్రసాద్‌రావు అన్నారు. స్థానిక చర్చిలో జరిగిన బీవీఎస్ సమావేశ ప్రత్యేక కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ పెప్పర్ షో, మ్యాజిక్ షో ద్వారా నేర్చుకున్న జ్ఞానాన్ని మంచి అలవాట్లతో సమాజానికి ప్రయోజనకరంగా మారాలన్నారు. మంచి మార్గం వైపు నడిపించిన నాయకుడు ఏసుక్రీస్తు అని, ప్రతి ఒక్కరూ క్రీస్తు బాటలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో చిన్నారులు పాల్గొన్నారు.

పెద్దబొమ్మలాపురంలో గాలివాన బీభత్సం



గాలి తీవ్రతకు నేల కూలిన అరటి చెట్లు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురంలో బుధవారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పలు పంటలు దెబ్బతిన్నాయి. గాలివాన తీవ్రతకు ఎర్రా కోటిలింగం, పిన్నిక పెద్ద రాజయ్య, ఎర్రా లక్ష్మయ్యలు సాగు చేస్తున్న అరటి తోటలు ధ్వంసమయ్యాయి. బొప్పాయి పంటలు సాగు చేస్తున్న దూదేకుల చిన్న కాశిం, మునగంటి శేఖరాచారి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. అరటి, బొప్పాయి పంటలు నేల పాలైనట్లు బాధిత రైతులు వాపోతున్నారు. గ్రామంలో మరి కొందరు రైతులకు సంబంధించిన పంటలు నేల కూలాయని, వారి వివరాలతో పాటు జరిగిన పంట నష్టం వివరాలు తెలియాల్సి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య భరోసా

- అర్హులైన దంపతులకు ఆరోగ్య బీమా వర్తింపు
- ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం

పెద్దారవీడు:

ఖరీదైన వైద్యం కారణంగా అప్పుల పాలైన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఆస్పత్రి పాలైతే కూడబెట్టుకున్న డబ్బంతా కరిగి పోవాల్సిందే. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే ముందస్తు ఆరోగ్య బీమా ప్రీమియం పెద్ద మొత్తంలో ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో అర్హులైన నూతన దంపతులు, వృద్ధులు ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) ద్వారా ఉచితంగా ఆరోగ్య బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఇప్పటి వరకు ఈ పథకం కింద పేద, తక్కువ ఆదాయ వర్గాలకే ఉచిత ప్రయోజనం అందుతోంది. ఇకపై ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా అర్హులైన దంపతులకు పీఎంజేఏవై కింద రూ.5 లక్షల నగదు రహిత హెల్త్ కవరేజి లభిస్తుంది. మండల పరిధిలో ఇప్పటి వరకు గొబ్బూరు, పెద్దారవీడు, బద్వీడుచెర్లోపల్లి గ్రామాల్లో దాదాపు 1200 మంది పేర్లను బీమా పథకంలో ఏఏన్‌ఎంలు నమోదు చేసినట్లు డాక్టర్ తెలిపారు.

ఉచిత బీమా పథకం

పీఎంజేవై పథకాన్ని 2018లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. పేద కుటుంబాలకు ఈ పథకం కింద ఆరోగ్య సేవలు అందుతున్నాయి. అర్హులైన దంపతుల వయసు పరిమితి లేకుండా, ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా రూ.5 లక్షల ఆరోగ్య బీమా అందుబాటులోకి తెచ్చింది. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరేందుకు మూడు రోజుల ముందు వరకు అయ్యే వైద్య పరమైన ఖర్చులకు సైతం నగదు రహిత కవరేజీ ఉంటుంది. చికిత్స సమయంలో మందులు ఉచితంగా అందిస్తారు. గుండె సంబంధిత వ్యాధులకు అమర్చే స్టంట్లు, ఐసీయూ, జనరల్ వార్డులో ఉండి పొందే చికిత్సకు బీమా వర్తిస్తుంది. రోగికి చికిత్స సమయంలో ఉచితంగా భోజనం అందిస్తారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత 15 రోజుల పాటు చికిత్సకు అయ్యే ఖర్చులకు చెల్లింపులు అందుతాయి. ఈ పథకం కింద ఇప్పటికే వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి ఆయుష్మాన్ కార్డులు జారీ చేశారు. ప్రస్తుతం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఎంజేఏవై.ఐఎన్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకుని ఆయుష్మాన్ కార్డు పొందవచ్చు.



ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఆయుష్మాన్ భారత్ బీమా పథకం

సద్వినియోగం చేసుకోవాలి:



కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పీఎంజేఏవై ఆరోగ్య బీమాను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే పేదలందరికీ ఈ పథకం కింద రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతోంది. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి కార్డులు జారీ చేశాం. అర్హులైన దంపతులు ఆధార్‌కార్డు ప్రకారం వివరాలు బీమా పథకంలో ఏఎన్ఎంలు నమోదు చేస్తున్నారు. తాజాగా ఆర్థిక, ఆదాయ పరిస్థితులకు సంబంధం లేకుండా ఈ పథకం వర్తింపజేస్తున్నారు. వీరికి కూడా రూ.5 లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకునే వెసులుబాటు కేంద్ర ప్రభుత్వం కల్పించింది. అర్హులు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

డాక్టర్ జగదీష్, ఎంపీహెచ్‌సీ, పెద్దారవీడు

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు



త్రిపురాంతకం: కుంకుమార్చన చేస్తున్న మహిళలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఉభయదాతలు

పెద్దదోర్నాల: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేడుకలను పురస్కరించుకుని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌ను పసిడి, రజిత ఆభరణాలు, పూలమాలలతో శోభయామనంగా అలంకరించారు. ఆలయ అర్చకులు బిదరె రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో తెల్లవారు జామున 5 గంటలకు అమ్మవారికి సుప్రభాతసేవ, క్షీరాభిషేకం, సహస్ర నామార్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. మహిళా భక్తులచే అమ్మవారికి లలితా సహస్రనామ పారాయణం, మహా మంగళ హారతి, శ్రీ వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. తమ ఇలవేల్పు శ్రీవాసవీ అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పులకించారు. భక్తులు కాయ కర్పూరాలు అమ్మవారికి సమర్పించుకున్నారు. అనంతరం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం పట్టణ పురవీధుల్లో నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను చీదెళ్ల నారాయణ, వెచ్చా హరగోపాల్, మొగిలి గుప్త పర్యవేక్షించారు.

దొనకొండ: శ్రీవాసవీ మాత జయంతి వేడుకలు ఆర్యవైశ్యులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆర్యవైశ్య కుటుంబాలన్నీ చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ స్థానిక శ్రీ పట్టాభి రామాలయంలో ఉదయం నుంచి వాసవీ మాతకు పూజలు చేశారు. విఘ్నేశ్వర పూజ, సుప్రభాత సేవ, కళశ స్థాపన, సహస్ర నామార్చన పూజలు చేశారు. మంగళ వాయిద్యాలతో హంస వాహనంపై వాసవీ మాతను పురవీధుల్లో ఊరేగించారు. బాలల ముత్తైదువులతో కుంకుమ పూజ జరిపించారు. పూజలు ఆర్యవైశ్య సంఘం తరఫున నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కాళ్ల హనుమంతు తెలిపారు. పట్టణ ఆర్యవైశ్య అధ్యక్షుడు పరుచూరి రమేష్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. భోజనాలు ఏర్పాటు చేశారు.

యర్రగొండపాలెం: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారి చిత్రపటం, కలశాన్ని పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం జరిగిన రథోత్సవంలో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిశాల అధ్యక్షుడు సూరె వెంకట ప్రసాద్, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, ఆదిత్య విద్యాసంస్థల అధినేత సూరె రమేష్, అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి జయంతి

పెద్దారవీడు: త్రిపురాంతకం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం నగర సంకీర్తన, గణపతిపూజ, మండపారాధన, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహానైవేద్యం, మంగళ హారతి తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ, సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. పులిహోర ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు.



అమ్మవారి చిత్రపటం, కలశాన్ని ఊరేగిస్తున్న భక్తులు



దొనకొండ: పురవీధుల్లో ఊరేగింపుగా వాసవీ మాత

అసమాన పోరాట యోధుడు అల్లూరి

దర్శి (కురిచేడు): మన్యం ప్రాంతంలో గిరిజనులను సాయుధులుగా మలిచి వీరోచిత పోరాటాలతో బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన అసమాన యోధుడు అల్లూరి సీతారామరాజు..అని డీవైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న సందర్భంలో నేటి ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి జిల్లాల అటవీ ప్రాంతంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులను అడ్డుకుని అటవీ ఉత్పత్తులను సేకరించకుండా ఆటంకాలు కల్పించి.. వారి జీవన భృతిపై దెబ్బ కొట్టి విపరీతమైన పన్నుల భారాలు వేసిన బ్రిటీష్ ప్రభుత్వంపై అల్లూరి సీతారామరాజు సాయుధ పోరాటాన్ని సాగించారని గుర్తు చేశారు. 27 ఏళ్ల వయసులోనే దేశమంతా రెండు సార్లు తిరిగి అనేక మంది జాతీయ నాయకులను కలుసుకుని జాతీయ ఉద్యమాన్ని అర్థం చేసుకుని పోరాటానికి దిగారని పేర్కొన్నారు. నాటి బ్రిటీష్ ప్రభుత్వం అధునాతన ఆయుధాలతో చేస్తున్న దాడిని ఎదుర్కొనేందుకు సీతారామరాజు బృందం పోలీసుస్టేషన్లపై దాడి చేసి ఆయుధాలు సమకూర్చుకుని తిరిగి వారిపై ఎక్కుపెట్టిన చరిత్రను తలచుకుంటే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారందరికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. అలాంటి వీరుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్యం నేడు మళ్లీ సామ్రాజ్య వాదులు, కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు యూ. నాగరాజు, సీపీఎం దర్శి మండల కన్వీనర్ సందు వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు తాండవ రంగారావు, మండల నాయకులు నారాయణ, షేక్ పీరాసాహెబ్, కంటా వెంకట్రావు, జి.కొండారెడ్డి పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివి



సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంఈఓ, వివిధ సంఘాల నాయకులు



ఎస్టీఓ కార్యాలయంలో..

దర్శి (కురిచేడు): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు దళిత, ప్రజాసంఘాల నాయకులు బుధవారం ఘన నివాళులర్పించారు. స్థానిక ఎంపీపీ చాంబర్‌లో రాష్ట్ర దళిత సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య వర్ధంతి సభ గర్నెపూడి ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ గోళ్లపాటి సుధాఅచ్చయ్య, ఎంఈఓ-2 రమాదేవిలు హాజరయ్యారు. దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రమాదేవి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో పుట్టి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తలా రెండు ఎకరాల భూమిని పంచిన ఏకైక మహనీయుడని కొనియాడారు. నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పు కళాకారుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరు యోగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాచపూడి కరుణానిధి, మాదిగ మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టుపల్లి ప్రసాద్, దంతులూరి కోటేష్, జంద్రాజుపల్లి ఏసేపు, డీపీఆర్సీ నియోజకవర్గ ఇన్‌చార్జి తప్పెట డేవిడ్ పాల్గొన్నారు.

ఉప ఖజానా కార్యాలయంలో..

దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా ఉప ఖజానా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్టీఓ మల్లేశ్వరి మాట్లాడుతూ ఆ మహానుభావుడు ప్రవేశపెట్టిన సంస్కరణల ఫలితమే ఈ రోజు మనం అనుభవిస్తున్న ఫలాలన్నారు. వారి త్యాగాలు ఎన్నటికీ మరచిపోకూడదని పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య దళితులకే నాయకుడు కాదని, యావత్ భారత దేశానికే గొప్ప విలువలు ఉన్న నాయకుడని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబరు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కార్యాలయ సిబ్బంది మస్తాన్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తీగలేరుతోనే సస్యశ్యామలం



పోస్టుకార్డు ఉద్యమానికి హాజరైన రైతులు

- రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్

పుల్లలచెరువు: ప్రభుత్వం తీగలేరు కాలువకు నిధులు మంజూరు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కుందంపల్లిలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో శాశ్వత నీటి సౌకర్యం లేక పోవడంతో వ్యవసాయం చేయాలంటే దినదిన గండంగా మారిందని, భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో 1000 అడుగుల మేర బోర్లు వేసినా నీరు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతానికి తీగలేరు కాలువ వస్తే తప్ప ఎటువంటి మార్గం లేదన్నారు. నీటి సౌకర్యం లేకుంటే మరికొన్ని రోజుల్లో తీవ్ర కరువ ప్రాంతంగా మారే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాగు, సాగు నీరు లేకుంటే ప్రజలు, పశువుల జీవన విధానం ఎలా ఉంటుందో అధికారులు, నాయకులు ఆలోచన చేయాలన్నారు. ప్రభుత్వాలు పలు సార్లు దీనిపై నివేదికలు ఇచ్చినా కదలిక లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతం సస్యశ్యామం కావాలంటే శాశ్వత నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. దీని కోసం ప్రజలు రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు వెనకాడరని, ప్రతి గ్రామం నుంచి వందలాది మంది రైతులు తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వెలుగొండ ప్రాజెక్టు సమస్యను పరిష్కరించి తీగలేరు కాలువకు నిధులు కేటాయించి పనులు సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. తీగలేరు సాధన కమిటీ సభ్యులు గురునాథం, రఘు, టీసీహెచ్ చెన్నయ్య, కోటిరెడ్డి, రామయ్య, వెంకటేశ్వర్లు, సాంబశివరావు, వెంకటనారాయణ, చలమయ్య, నారాయణ, శ్రీను, ఆవులయ్య, నాగేషు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆరాధన



దొనకొండ: ఆరవల్లిపాడులో..

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని వీరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన మహోత్సవాన్ని భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, కలశ తీర్థం, మహాన్యాస పూర్వక యంత్రాభిషేకం, హవనం, మంత్ర పుష్ప కర్పూర మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయంలో పూర్ణాహుతి నిర్వహించి స్వామివారి ఉత్సవ విగ్రహాలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి నగరోత్సవం చేశారు.

దొనకొండ: మండలంలోని పలు గ్రామాల్లో వెలసిన బ్రహ్మంగారి ఆరాధన బుధవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆడపడుచులు, పిల్లలు తలంటి స్నానాలు చేసి బ్రహ్మంగారి దేవాలయాల్లో మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆరవల్లిపాడు శ్రీవీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన భక్తులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఆనంద ఆశ్రమంలో, ఇండ్లచెరువులో బ్రహ్మంగారి ఆరాధన సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

కుట్టుమిషన్లు, వీల్‌చైర్లు పంపిణీ



కుట్టుమిషన్లు, వీల్‌చైర్లు అందజేస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

దర్శి (కురిచేడు): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రెండు కుట్టుమిషన్లు, ఆరు వీల్‌చైర్లు డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ రామారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుండి దర్శికి మంచిపేరు తీసుకొస్తున్నందుకు అభినందనలు తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ దర్శి ప్రజల మన్ననలు పొందాలని, లబ్ధిదారులు రోటరీ క్లబ్ ఇచ్చిన వస్తువులను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని కోరారు. రూ.60 వేల విలువైన కుట్టుమిషన్లు, వీల్‌చైర్స్ ఇచ్చిన రోటరీ సభ్యులను సీఐ రామారావు అభినందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పానుగంటి కోటేశ్వరరావు, కార్యదర్శి అంబవరపు నారాయణరెడ్డి, రోటరీ సభ్యులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, పేరిరెడ్డి, సోము దుర్గారెడ్డి, మారం శివకోటిరెడ్డి, రెడ్డిమాసు శ్రీనివాసులు, మారం సత్యనారాయణరెడ్డి, యేరువ లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్ పథకాన్ని ఉపయోగించుకోవాలి

తాళ్లూరు: ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకాన్ని ప్రతి రైతు ఉపయోగించుకోవాలని విద్యుత్ శాఖ దర్శి ఈఈ పి.శ్రీనివాసరావు కోరారు. మండలంలోని తూర్పు గంగవరంలో విద్యుత్ శాఖ అధికారులు రైతులతో ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం గురించి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ పథకం కింద రెండు లక్షల విలువైన మూడు కిలోవాట్ల సోలార్ ప్యానల్‌ను రూ.78 వేల సబ్సిడీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందవచ్చన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క రైతు ఈ పథకాన్ని ఉపయోగించుకొని లబ్ధి పొందాలన్నారు. సబ్ ఇంజినీర్ ఇమ్మానేయులు, ఎల్ఐ వీవీఎస్ కాంతారావు, లైన్‌మెన్ సీహెచ్ నారాయణ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసరావు

రోడ్ల పక్కన దిబ్బలు తొలగించాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పద్మ

ముండ్లమూరు (కురిచేడు): రోడ్ల పక్కన దిబ్బలు తొలగించి వీధుల వెంట చెత్త లేకుండా చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.పద్మ సూచించారు. మండలంలోని తూర్పు కంభంపాడు, నూజెళ్లపల్లి గ్రామాలను పద్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్తలు వేరు చేయడంలో గ్రామంలో తడి చెత్త, పొడి చెత్తలు వేరు చేయడంలో గ్రామ ప్రజలకు అవేర్‌నెస్ కల్పించాలని తెలిపారు. అనంతరం కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. కార్యదర్శులు బి.వేణుగోపాల్, టి.స్వర్ణలత పాల్గొన్నారు.